# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్‌రాజు





-24-

## అమెరికామెంటులూ, లైకులూ

ముందుగా అందరికీ నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు.

ఆ మధ్య ముఖ పుస్తకంలో అందరికీ కావలసిన లైకుల మీద చేసిన ఒక చిన్న పోస్ట్ కి స్పందన బాగానే ఉంది కానీ అసమగ్రంగా ఉంది అనిపించింది. అంచేత పాతసారాని ఈ కొత్త సీసాలో పోసేసి బ్రాందీని విస్కీ చేద్దాం అనే ప్రయత్నం లో ఈ అమెరికులసా కథ వ్రాస్తున్నాను. కథాంశం పరిధి పెరిగి ఉత్తుత్తి లైకుల దగ్గరే ఆగిపోకుండా కాస్త ఓపిక ఉన్న వాళ్ళు పెట్టే కామెంట్స్ కూడా కలిపి ఇది నా పేద్ద అమెరికామెంట్. ఈ నెల ..ఆ మాటకొస్తే ఏ నెల అయినా నా అమెరి"కులాసా" కథ చదివి "పోలో" మని వేలకొద్దీ పాఠకులు చదివేసి, అనందించేసి, లైకులు కొట్టేసి, కామెంట్లు పెట్టేసి నన్ను ఖుషీ చేసేసి మరిన్ని కథలు వ్రాయమని ప్రోత్సహిస్తారు అనే అపోహ నాకు ఏ మాత్రం లేదు. అసలు ఈ ఇష్టాలు..అనగా లైకులు, వ్యాఖ్యలు..అనగా కామెంట్స్ రెండింటినీ తార్కికంగానూ, మరియు వాస్తవంగానూ శల్యపరీక్ష చేసుకుంటే నాకు ఆ అపోహ ఎందుకు లేదో తెలిసిపోతుంది.

అమెరికామెంట్స్ గురించి నా కామెంట్...

"ఇందు గలది, అందు గలది, ఎందెందు వెదకిన అందే గలదు" అనే సూక్తికి అంతర్జాలంలో ప్రధాన ఉదాహరణ ఈ కామెంట్స్..వ్యాఖ్య...ఎక్కడ చూసినా ఈ వ్యాఖ్యలే. పత్రికల విషయానికొస్తే పూర్వ కాలం వీటిని "ఉత్తరాల శీర్షిక" అనే వారు. ఇప్పుడు కూడా ముద్రణ పత్రికలలో అలాంటిదే ఉంది కానీ సంపాదకులు తెలివిగా ఆ ఉత్తరాలలో వాళ్ళని పొగుడుతూ ఉన్న రెండు, మూడు వాక్యాలు మాత్రమే వేసి ఊరు కుంటున్నారు. ఆ ఉత్తరాలు అన్నీ సంపాదకులకే వ్రాసేవారు. కానీ అంతర్జాలంలో అలాక్కాదు. అన్ని కామెంట్సు తిన్నగా రచయితకే. అంతర్జాలం పత్రికల పాఠకులకి ఉత్తరాలు వ్రాసే సమయం లేదు కాబట్టి ఏదో కొన్ని వాక్యాలు బరికేస్తే వాటిని కామెంట్స్ అంటూ వేసుకుంటారు. ఈ కామెంట్స్ లో ప్రధాన లక్షణం ఏమిటంటే ..వాటిని ఇద్దరే చదువుతారు. ఒకరు 'దడిగాడు వాన సిరా". రెండోది వ్రాయించుకున్న వాడు. అంటే ఇక్కడ నన్ను అపార్థం చేసుకోవద్దు అని ప్రార్థన. వ్రాయించుకున్న వాడు అంటే డబ్బిచ్చి సన్మానం చేయించుకునే వాడి బాపతు అని కాదు నా ఉద్దేశం. ఏ కథో, కవితో, వ్యాసమో చదివి ఈ కామెంట్ వచ్చిందో ఆ కథో, కవితో, వ్యాసమో వ్రాసిన "దడిగాడు వానసిరా" అన మాట. మరో ఆసక్తికరమైన విశేషం ఏమిటంటే ఆయా పత్రికల సంపాదకులు వారి, వారి ప్రగాఢమైన సంపాదకీయాలకి

వచ్చిన కామెంట్స్ మాత్రమే చూస్తారు. ఎందుకంటే పత్రికలో ఉన్న మిగతా ఇరవై , ముప్పై అంశాల తాలుకు వ్యాఖ్యలు చదవడానికి సమయమూ ఉండదు, ఆసక్తి అంత కన్నా ఉండదు. పైగా ఆ కామెంట్స్ రచయితల మీదే కాబట్టి వీళ్ళకేం సంబంధం ఉండదు.

ఇక అంతర్జాల పత్రికలలో ఈ వ్యాఖ్యదారులు..అంటే వ్రాసే వారిని మూడు రకాలుగా విభజించవచ్చును. మొదటిది "నిరంతర వ్యాఖ్యాసురులు" అనగా Frequent Flyers. వీరికి తమ పేరిట వ్యాఖ్య పడిందా లేదా అనేది ముఖ్యం. అందుచేత అసలు కథ, కవిత..ఇవి ఎలా ఉన్నా "చాలా బావుంది" అనో "బాగా వ్రాశారు" అనో పోస్ట్ కట్ అండ్ పేస్ట్ లో విడుదల అయిన అన్ని పత్రికల అన్ని అంశాలకీ ఉంటుంది. నా బోటిగాళ్ళు ముందు ఇవి చూసి "ఈ పోస్ట్ గారు ఎంత మంచి వారో, నన్ను మెచ్చుకున్నారు" అనుకుని "ధన్యవాదాలు" అని తిరిగి పోస్ట్ చేస్తాం. కానీ ఇలా ఒక పది సార్లు అయాక ఈ మెచ్చుకోలు మాటలు కంప్యూటర్ జనరేటెడ్ మెసేజ్ ఏమో అని అనుమానం వచ్చి డిలీట్ కార్యక్రమం మొదలు పెడతాం. రెండోరకం కేవలం గ్లామర్ ఉన్న సినీ వాళ్ళకో, బాగా పేరున్న గొప్పవాళ్ళ రచనలకో మాత్రమే కామెంట్స్ పెడతారు. అంటే గొప్పవాళ్ళతో భుజాభుజాలు రాసుకుంటున్న శునకానందం కేసులనమాట. ఇక మూడో రకం ఎడ్డెం –తెడ్డెం రకం వారు. వీళ్ళు ఎప్పుడు కామెంట్ పెట్టినా అది వ్యతిరేకమే...ఇలా కాక పోతే అలాగా, అలాక్కక పోతే ఇలాగ అనే రకం. ఇక ముఖ పుస్తకంలో వచ్చే వ్యాఖ్యలకీ, అంతర్జాల పత్రికలలో కథల మీద వచ్చే వ్యాఖ్యలకీ పోలికే లేదు. ఏ మాత్రం బుర్రకి పని పెట్టకుండా నాలుగు ఫోటోలు పెట్టేస్తే వంద లైకులూ, పాతిక కామెంట్సూ కొట్టెయ్యడం ముఖ పుస్తకంలో సులభం. ఒక ఎంతో గొప్ప కథో, కవిత్వమో వ్రాసినా పత్రికలలో వాటికి ఒకటో, రెండో వ్యాఖ్యలు వస్తే ఇక పండగే పండగ.

ముఖ పుస్తక 'ఇష్టం' అనగా లైకుల గురించి నా చిరు ఉవాచ ....

నా లెక్కల పరిజ్ఞానం ప్రకారం FB లో ఒక్క లైకు ఈజ్ ఈక్వల్ టు ఒక్క లైకు మాత్రమే అనిన్నీ, ఆయనా, లేదా ఆవిడా కలిసి కూడబలుక్కుని 'కొట్టిన' బాపతు కానీ, ఎవరి కొట్టుడు వారిదే అనిన్నీ, ఆ లైకాసురులు వెచ్చించిన మొత్తం సమయం అరక్షణం అనీ మన చిన్నా, పెద్దా పోస్టింగులు కానీ, ఫోటోలు కానీ, వీడియోలు కానీ చదివిన దాఖలాలు లేవనీ నాకు అర్థం అయింది. ఎందుకంటే .....ఈ మధ్య నా పోస్ట్ లు కొన్ని నేను "share' అనో "Post' అనో బటన్ మీద నొక్కి, నేను నొక్కిన వేలు ఇంకా అక్కడే ఉండగా......అనగా పది పేరాలు, ఇరవై ఫోటోలు ఉన్న సదరు పోస్ట్ మహా అయితే మా టెక్సస్ రాష్ట్రం ఎల్లలు దాటిందా అనుకుంటూ ఉండగానే మూడు దేశాల నుంచి ఆరు లైకులు వచ్చినట్టు నా కంప్యూటర్ టింగు, టింగు మరియు మరో టింగు మూడు సార్లు కొట్టింది.

చెప్పొద్దూ ...నాలుగు రోజులు కష్టపడి పంపించిన ఆ పెద్ద పోస్ట్ ని అరక్షణం లో చదివేసి "ఇష్టపడి' నట్టు వారు నాకు తెలియపరచడం నాకు చాలా సంతోషం కలిగించి "వావ్, అరక్షణం లో ఆరు లైకులు.. " అని నేను కెవ్వు కేక పెట్టగానే వెనకాల కిచెన్ లో ఉన్న మా క్వీన్ విక్టోరియా "వాళ్ళంతా సాఫ్ట్ వేరు గాళ్ళు. నీ లాగా వట్టివేళ్ళ గాళ్ళు కాదు. వాళ్ళ కంప్యూటర్ లో కొత్త పోస్ట్ టింగ్ అనగానే లైకు బటన్ టంగ్ అని తిరుగు కొట్టేస్తుంది..ట. అయ్యో, వెర్రివాడా,ఎలా బతుకుతావోయ్ మొగుడూ" అని మా క్వీన్ విక్టోరియా కిచెన్ లో కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకోవడం అనుకోకుండా గమనించాను. అలా అని ఒక రోజు తరవాత వచ్చిన లైకుల వారు పూర్తిగా చదివిన గేరంటీ అంత కన్నా లేదు. కానీ కనీసం ఫోటోలయినా చూసి ఉంటారు అనుకోవచ్చును.

ఏది ఏమైనా, ఏ పోస్ట్ కయినా లైకు జీవితం మహా అయితే రెండు రోజులు. ఆ లోగా మిగిలిన ఐదు వేల మందికి పైగా ఉన్న FB మిత్రులు ఇష్టపడక పోతే మనం ఇక కష్టపడక్కర లేదు. ఎప్పుడైనా ఆ పోస్ట్ చేసిన మనమే పూర్తిగా మర్చిపోయిన తర్వాత ఏదైనా లైకు వస్తే ఆ మానవుడు అన్నాళ్ళు పాపం జబ్బు పడి అప్పుడే కోలుకున్నాడు అనుకోవచ్చును. లేదా కొత్తబిచ్చగాడు అయి ఉండవచ్చును. లైకు కొట్టించుకోలేని పోస్టులు పోస్టనేల? విత్తు ముందా? చెట్టు ముందా? పోస్ట్ ముందా? లైకు ముందా?

ఏది ఏమైనా ఈ FB ని ఇష్ట పడకుండా ఉండలేం. మన పోస్ట్ కి ఎన్ని 'ఇష్టాలు' వస్తే మన ఇష్టం అంతకు రెట్టింపు అవుతుంది. అంచేత ఆ 'ఇష్ట పడడం' పని మానకండి.

మరొక చిన్న ప్రశ్న..ఆ మధ్య ఒకాయన "మీరు ఏ సమయంలో మీ పోస్ట్ పెడతారో దాన్ని బట్టి లైకుల సంఖ్య ఉంటుంది నాయనా. నువ్వు తెల్లారగట్ట పెడితే ఎవడు చూస్తాడు? తెల్లారే సరికి వాడి కంప్యూటర్ లో అప్పటికే నీ తరవాత వచ్చినవి సవాలక్ష ఉంటాయి కదా! అంచేత పొద్దున్న అందరూ పళ్ళు తోముకుని, టిఫిన్ చేసి ఆఫీసుకి వెళ్లి కంప్యూటర్ తెరవగానే టింగుమని నీ పోస్ట్ వెళ్లిందంటే..నీకు లైకు గేరంటీ...అంటే పొద్దున్న పదకొండు అనమాట. ఆయన లెక్క ఇండియా లెక్క. అంటే ఇక్కడ అమెరికాలో అర్ధరాత్రి. అంటే అదే పోస్ట్ ఇండియా వాళ్ళ కోసం అర్ధరాత్రి, అమెరికా వాళ్ళకోసం పొద్దున్న 8 గంటలకీ పెట్టే ఏర్పాటు ఏమన్నా ఉందా? అసలు పోస్ట్ సమయాలకి నియమాలు ఏమైనా ఉన్నాయా?

ఇక FB వాడికే దుర్బుద్ధి పుట్టి "అయిష్టం' ..అనగా dislike బటన్ పెట్టాడో? "ఏముంది? నీ కొంప మునుగుతుంది. నీ కంప్యూటర్ ఆగకుండా గంట కొడుతూనే ఉంటుంది.

ఇలా కామెంట్స్ తోటో, లైకుల తోటో మా ఫోన్ లోనో, కంప్యూటర్ లోనో గంటల కొద్దీ గంట కొట్టించుకోవడమే నా నూతన సంవత్సరం ప్రతిజ్ఞ..చూద్దాం ఏమవుతుందో?

**COMMENTS**